జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



# బంగారం కోసం.. హత్య?



* ఐదు రోజుల కిందట అదృశ్యమైన వృద్ధురాలు చిన్నమ్మడు * ఫిర్యాదు చేసిన కుటుంబీకులు * పింద్రువాడ కాలువ గట్టుపై మృతదేహం * పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు * నిందితుల కోసం ఐదు మండలాల పోలీసులు గాలింపు * పోలీసుల అదుపులో పలువురు అనుమానితులు



జలుమూరు, ఆగస్టు 22 (వార్త): జలుమూరు మండలం అల్లాడపేటకు చెందిన చింతు చిన్నమ్మడు (70) అదృశ్యం మిస్టరీగా మారింది. ఈ నెల 17న పాసు పుస్తకాలకు సంబంధించిన నోటరీ పని నిమిత్తం నరసన్నపేటకు వెళ్లిన ఆమె, ఐదు రోజుల అనంతరం హిరమండలం మండలం పింద్రువాడ గ్రామ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతదేహంగా కనిపించింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నమ్మడు తన పాసు పుస్తకాలకు సంబంధించిన పత్రాలను నోటరీ చేయించుకోవాల్సి ఉండటంతో రెవెన్యూ సిబ్బంది సూచన మేరకు నరసన్నపేటకు వెళ్లారు. అక్కడ ఓ న్యాయవాదిని కలిసి అవసరమైన పనులు పూర్తి చేసుకున్నట్లు సమాచారం. అనంతరం ఆమె తన కుమారుడితో చివరిసారిగా ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. చిన్నమ్మడు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు జలుమూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 17న మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పలు ప్రాంతాల్లో విచారణ జరపడంతో పాటు డాగ్ స్క్వాడ్‌ను కూడా రంగంలోకి దింపారు. డాగ్ స్క్వాడ్ నరసన్నపేటలోని ఆసుపత్రి రోడ్డులో ఓ ఇంటి వరకు వెళ్లినట్లు సమాచారం. అయితే శనివారం హిరమండలం మండలం పింద్రువాడ గ్రామ సమీపంలోని వంశధార ఎడమ కాలువ గట్టు పొదల్లో ఓ సంచిలో కట్టివేసిన స్థితిలో మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం చిన్నమ్మడిదేనని గుర్తించి ధృవీకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చిన్నమ్మడు పెద్ద మొత్తంలో బంగారం ధరించి ఉండడంతో వాటి కోసమే హత్య జరిగి ఉండవచ్చన్న కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. ఆమె వద్ద ఉన్న నగలు, చివరిసారిగా ఎవరెవరితో మాట్లాడారు, నరసన్నపేట నుంచి ఆమె ఎక్కడికి వెళ్లారు, ఆ తర్వాత ఆమెతో ఎవరైనా ఉన్నారా వంటి అంశాలపై ఆరా తీస్తున్నారు. మృతికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు. కేసును ఛేదించేందుకు జలుమూరు, నరసన్నపేట, పోలాకి, సారవకోట, హిరమండలం మండలాల పోలీసు అధికారులు సమన్వయంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. అనుమానితుల కదలికలపై నిఘా ఉంచి, సంబంధిత వ్యక్తులను విచారిస్తున్నట్లు సమాచారం. మృతురాలు చిన్నమ్మడుకు ఇద్దరు కుమారులు శంకర్‌నారాయణ, సుధాకర్‌రావుతో పాటు కుమార్తె హైమావతి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త రామారావు గతంలోనే మృతి చెందినట్లు పేర్కొన్నారు. ప్రశాంతంగా జీవిస్తున్న వృద్ధురాలు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడంతో అల్లాడపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



* మానసికంగా వేధిస్తూ దుర్భాషలాడుతున్నారు * మనోభావాలను దెబ్బతీస్తున్నారు * మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసిన మహిళా ఉపాధ్యాయులు * విద్యాశాఖ మంత్రి, ఉన్నతాధికారులకు రాతపూర్వక ఫిర్యాదు * సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్

# హెచ్‌ఎం.. వేధిస్తున్నారు

నరసన్నపేట/జలుమూరు, ఆగస్టు 22 (వార్త): నరసన్నపేట మండలం దేశవానిపేట పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ తమను మానసికంగా వేధిస్తూ, ప్రతి చిన్న విషయంపై అవమానపరిచే విధంగా దుర్భాషలాడుతున్నారని ఉపాధ్యాయులు రాజారత్నం, శోభారాణి, శకుంతల ఆరోపించారు. శనివారం పాఠశాల ఆవరణలో వారు మాట్లాడుతూ, విధుల నిర్వహణలో తమను అనవసరంగా ఇబ్బందులకు గురిచేస్తూ మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. చిన్నచిన్న విషయాలకే తమను అవమానించే విధంగా వ్యవహరిస్తూ, మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై విద్యాశాఖ మంత్రి, సంబంధిత ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. తమపై జరుగుతున్న వేధింపులపై సమగ్ర విచారణ చేపట్టి, నిజానిజాలు పరిశీలించాలని కోరారు. పాఠశాలలో మంచి వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఉపాధ్యాయులు కోరారు. అయితే, ఉపాధ్యాయులు చేసిన ఆరోపణలపై హెచ్‌ఎం ప్రసాద్ ఖండించారు.



# ఘాటెక్కిన ఉల్లి

* రైతుబజార్‌లో కిలో రూ.47 * పెద్దబజారులో రూ.50కిపైనే

శ్రీకాకుళం, ఆగస్టు 22 (వార్త): ఉల్లి.. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఘాటెక్కిస్తోంది. ప్రస్తుతం రైతుబజార్లలో కిలో ఉల్లి రూ.47 నుంచి రూ.50లు ఉండగా, పెద్దబజార్‌లో రూ.50కు పైగానే ధర పలుకుతోంది. పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో ఒక్కసారిగా ఉల్లి ధర రెట్టింపయ్యింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లి ధర అమాంతం పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఓటర్లకు నోటీసులివ్వరా..?

-వెనుకబాటుపై కలెక్టర్ ఆగ్రహం

- బీఎల్వో విధులపై అసంతృప్తి

- సర్‌లో తప్పులు లేకుండా చూసుకోవాలని సూచన

**జి.సిగడాం, ఆగస్టు 22(వార్త):** కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ సప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. శనివారం ఆయన జి.సిగడాం మండలంలో సిగడాం 8,9, 10, 11, 12 దాలెం రాజువలస 20,21 గ్రామల పోలింగ్ స్టేషన్ లను ఆకస్మిక తనిఖీ చేశారు. సర్ ప్రక్రియలో ఏ బీఎల్‌వో అలసత్వం వహించినా చర్యలు తప్పని హెచ్చరించారు. ఎన్నికల శాఖ చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. చాలా బూత్‌లలో ఓటర్ల జాబితాలోని మ్యాపింగ్ లేని ఓటర్లు, చిరునామా, పేర్లు సవరణ అందుబాటులో లేని ఓటర్లకు నోటీసులు అందించడంలో వెనుబాటుపై ఆయన అసహనం వ్యక్తం చేసారు. త్వరితగతిన ఓటర్లకు నోటీసులు అందించి వారి నుంచి అభ్యంతరాలు స్వీకరించి గడువులోగా సర్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సమగ్ర ఓటర్ల సర్ సర్వే రికార్డులను, పత్రాలను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందన్నారు. ఓటర్ల జాబితాను ముందు ఉంచుకొని వాటిని క్షుణంగా పరిశీలించి ఏదైనా తప్పులు ఉంటే సవరించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని పేర్కొన్నారు. జాబితాలో తప్పులు లేకుండా సరిదిద్దాలని ఆదేశించారు. అందరికీ ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. సర్ ప్రక్రియ వేగవంతం చేయాలని చెప్పారు. ఓటర్ల జాబితాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎచ్చెర్ల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి, తహసీల్దార్ మహాదేవుని సరిత, డిప్యూటీ తహసీల్దార్ ఎన్.నిర్మల, డిప్యూటీ ఎంపీడీఓ మురళీ, మండల ఎన్నికల సహాయకులు సాయి, పంచాయతీ కార్యదర్శి తులసీ ప్రసాద్ సాహు, బిల్ కలెక్టర్ వై.గుణబాబు, కుప్పిలి సీతయ్య, ఎం,మధులత, గొర్లె రజిని, బీఎల్‌వోలు ఉన్నారు.



## 21వ వార్డులో ఇంటింటికి తెలుగుదేశం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 22 (వార్త):** ఇచ్ఛాపురంలోని 21వ వార్డు (బూత్ నెంబర్ 39, 40)లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు ఈ రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలని ప్రజలకు వివరించారు. వర్షానికి సైతం లెక్కచేయకుండా కార్యకర్తలు ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు, సీనియర్ నాయకులు కాళ్ల ధర్మారావు , నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు 21వ వార్డు ప్రతినిధి కాళ్ల జైదేవ్, ఐ టిడిపి పట్టణ అధ్యక్షులు సాలిన జగదీశ్, పట్టణ కార్యదర్శి దట్టి శ్రీను, కాళ్ల ఢిల్లీరావు, కాళ్ల శివ, దట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు.ం



## -భారీ వర్షంలోనూ నిరసన

**ఇచ్ఛాపురం, ఆగస్టు 22 (వార్త):** మండపల్లి స్వర్ణ గ్రామ వార్డులో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రౌత్ మెహర్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందడం పట్ల స్వర్ణ గ్రామ వార్డు ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మెహర్ మృతి వార్తతో భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తోటి ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు నిర్వహించి, ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. ఒకే ఉద్యోగిపై నాలుగు రకాల కీలక బాధ్యతలు మోపడం వల్ల తీవ్ర పని ఒత్తిడి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మెహర్‌పై బిఎల్ వో విధులు, మండల సెన్సెస్ కోఆర్డినేటర్ బాధ్యతలు, ఆధార్ ఆపరేటర్ విధులు, డిజిటల్ అసిస్టెంట్‌గా రోజువారీ సర్వీసులు, సర్వేలు వంటి పలు బాధ్యతలు ఒకేసారి అప్పగించారని తెలిపారు. ఇప్పటికే ఉద్యోగులు తమపై ఉన్న పని భారాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, బాధ్యతలు తగ్గకపోవడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఇలాంటి పని ఒత్తిడి కారణంగా ఉద్యోగుల ఆరోగ్యం దెబ్బతినడం, ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. మెహర్ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని స్వర్ణ గ్రామ వార్డు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి న్యాయబద్ధంగా అందాల్సిన అన్ని ఆర్థిక, సంక్షేమ ప్రయోజనాలను కుటుంబానికి అందించాలని కోరారు. అలాగే విధి నిర్వహణలో తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగుల పరిస్థితిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర స్వర్ణ గ్రామ వార్డు సంఘం జేఏసీ కోఆర్డినేటర్ కూన వెంకట సత్యనారాయణ, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ ఫరూక్, జిల్లా కోఆర్డినేటర్లు ఉప్పాడ జైకృష్ణ, పొల్లాయి అశోక్, విజయకుమారి,అబ్దుల్, సర్వేశ్వర్,కొప్పిలి రవిబాబు, వాసుదేవ్, సూర్య కుమారి,ప్రదీప్, , సునీల్, గఫూర్, ప్రవీణ్ , మీనాక్షి, నీరజ తదితరులు పాల్గొన్నారు.

# పలాసలో వాన జోరు.. జన జీవనం అస్తవ్యస్తం

-ఎడతెరిపిలేని వర్షంతో పలు ప్రాంతాలు జలమయం

-చిత్తడిగా మారిన మున్సిపల్ రహదారులు

- కాలువల్లోకి భారీగా చేరుతున్న వరద నీరు



**పలాస, ఆగస్టు 22 (వార్త):** పలాస ప్రాంతంలో శనివారం వర్షం జోరందుకుంది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లోనూ వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా సాధారణ జనజీవనం కొంతమేరకు స్తంభించింది.

### రహదారులన్నీ చిత్తడే..

కొద్దిపాటి వర్షానికే మున్సిపల్ పరిధిలోని పలు రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. గుంతలు, గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల రహదారిపై నీరు నిలిచిపోవడంతో గుంతలు కనిపించక ప్రమాదాల భయం నెలకొంది.



### కాలువల్లోకి వరద నీరు

పట్టణంలోని మురుగునీటి కాలువలు, ప్రధాన డ్రైనేజీల్లోకి వర్షపు నీరు పెద్దఎత్తున చేరుతోంది. కాలువల్లో పూడిక, చెత్త పేరుకుపోవడం, నీటి పారుదల మార్గాలు సక్రమంగా లేకపోవడంతో నీరు వేగంగా బయటకు వెళ్లలేకపోతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. వర్షం మరింతగా కొనసాగితే ఇబ్బందులు తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ముందస్తు చర్యలపై దృష్టి సారించాలి

వర్షాకాలంలో తరచూ ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగించడం, నీటి పారుదల మార్గాలను పరిశీలించడం, గుంతలతో ఉన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడ నీరు నిలవకుండా ప్రత్యామ్నాయ పారుదల ఏర్పాట్లు చేస్తే వర్షాల సమయంలో ప్రజల ఇబ్బందులను కొంతవరకు తగ్గించవచ్చని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.ం

# ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



**కవిటి, ఆగస్టు 22(వార్త):** కవిటిలో మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ గంటి మోహన్,కో కన్వీనర్ బీన ప్రదీప్, జిల్లా కోకన్వీనర్ అనిల్ ఆధ్వర్యంలో స్థానిక మహాలక్ష్మి థియేటర్ వద్ద ఈ వేడుకలు జరిగాయి. కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లోళ్ల రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై బర్త్డే కేక్ ను కట్ చేశారు. అలాగే చిరంజీవి నటించిన సూపర్ హిట్ మూవీ “శంకర్ దాదా ఎంబిబిఎస్ “ మహాలక్ష్మి థియేటర్లో అభిమానుల కోసం ఉచితంగా ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో అభిమానులు రాకతో జన్మదిన వేడుకలు ఎంతో కోలాహలంగా జరిగాయి. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమలో మెగాస్టార్ గా ఓ వెలుగు వెలిగిన చిరంజీవి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కళామతల్లి ముద్దుబిడ్డగా దశాబ్దాలుగా సినీ రంగంలో విశేష సేవలు అందించి అనేక సేవా కార్యక్రమాలతో ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న చిరంజీవికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిప్పన దుర్యోధన రెడ్డి, బైపల్లి ఈశ్వరరావు, దూగాన సిసింద్రీ, నియోజకవర్గ మెగా యూత్ ఫోర్స్ అభిమానులు పాల్గొన్నారు.

## డయాలసిస్ కేంద్రంలో..

# అదనపు సిబ్బందిని నియమించండి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 22 (వార్త):** ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ప్రాంగణంలో గల డయాలసిస్ కేంద్రంలో కేవలం ముగ్గురు సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉన్నారని అదనంగా ఇంకో ముగ్గురు సిబ్బంది అవసరం ఉందని నియోజకవర్గ వైస్సార్సీపీ సమనవ్య కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి కోరారు. ప్రతీ డయాలసిస్ తరువాత ఏరీత్రోపోయిటిన్ ఇంజక్షన్ రోగికి వేయాలి, కనీసం వారానికి ఒకసారి ఇంజక్షన్ వేయాలి, ఆ లెక్కన కనీసం 170 -మాక్సిమం 500,ఇంజక్షన్ స్టాక్ అందుబాటులో ఉండాలి కానీ ఫార్మసీ లో స్టాక్ కేవలం 2 మాత్రమే ఉన్నాయని, ఒక్కో ఇంజక్షన్ ధర సుమారు 400 రూపాయలు వెచ్చించి రోగులు బయట కొనుగోలు చేయాలివస్తోందని అన్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితి తరచుగా చెక్ చేయడానికి నేఫ్రాలోజిస్ట్ ఉండాలి కానీ ప్రస్తుతం జనరల్ ఫిజిషియన్ మాత్రమే చెక్ చేస్తారు, వారు కూడా డయాలసిస్ తరువాత రోగులు ఆసుపత్రికి వెళ్లి ఓ పి క్యూ లో డాక్టర్ ను కలవాలి,అలా కాకుండా డయాలసిస్ రోగులకు వెయిటింగ్ లేకుండా డాక్టర్స్ చెక్ చేయగలిగితే మంచిదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒక్కసారి డయాలసిస్ కొరకు గ్రామల నుండి పేషెంట్ అటెండెంట్ ఆటో వాహనంలో డయాలసిస్ కేంద్రానికి వచ్చి వెళ్లేందుకు 5వందల నుండి 8 వందల రూపాయల ఖర్చులు అవుతున్నాయని, వారానికి రెండు, నెలకు 8 సార్లు మొత్తం కలిపి సుమారుగా 5వేలు నుండి6వేలు అవుతుందని అన్నారు. ఆసుపత్రిలో సరిపడా మందులు, ఇంజక్షన్లు లేకపోవటం వలన బయట కొనుగోలు చేయాలి, ఆపై ఆటో చార్జెస్ కలిపి ప్రభుత్వం ఇచ్చే పదివేల పెన్షన్ సరిపోవడం లేదన్నారు. నియోజకవర్గంలోని 3 డయాలసిస్ కేంద్రాలలో రోగులకు అందుబాటులో ఉండేలా నెఫ్రాలజిస్ట్‌ని నియమించాలని కోరారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఆధారాలతో నిలదీసినా సమాధానమేదీ?

**-మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి**

**కొత్తూరు, ఆగస్టు 22 (వార్త):** డీఎస్సీ-2025 వ్యవహారంపై వైఎస్సార్సీపీ మరోసారి టీడీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాక్ష్యాధారాలతో ప్రశ్నలు లేవనెత్తినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించకుండా మౌనం వహిస్తున్నారని వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డీఎస్సీ--2025పై తాము చేసిన ఆరోపణలపై సీబీఐ విచారణకు సిద్ధమని ప్రకటిస్తూ, అదే సమయంలో 2018 గ్రూప్--1 నియామకాలపై చంద్రబాబు చేస్తున్న ఆరోపణలపైనా సీబీఐ దర్యాప్తునకు సిద్ధంగా ఉన్నామని వైఎస్ జగన్ స్పష్టం చేశారని ఆమె తెలిపారు. రెండు అంశాలపై తక్షణమే సీబీఐ విచారణ కోరుతూ దర్యాప్తు సంస్థకు లేఖ రాయాలని చంద్రబాబు, లోకేశ్‌కు జగన్ సవాల్ విసిరారని పేర్కొన్నారు.

జగన్ సవాల్ చేసి 36 గంటలు గడిచినా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ నుంచి ఎలాంటి స్పష్టమైన స్పందన రాలేదని రెడ్డి శాంతి అన్నారు. సవాల్‌ను స్వీకరిస్తున్నామని కానీ, సీబీఐ విచారణకు సిద్ధమని కానీ వారు ప్రకటించలేదని విమర్శించారు. దీనిపై నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థులు, విద్యావేత్తలు సమాధానం కోరుతున్నారని ఆమె పేర్కొన్నారు.

డీఎస్సీ పరీక్షలో ప్రశ్నల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే అధికారి చేతిలో పెట్టిన విషయాన్ని మంత్రి లోకేశ్ స్వయంగా అంగీకరించారని రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ విధానం ప్రశ్నపత్రం లీకేజీకి అవకాశం కల్పించేలా ఉందని వైఎస్సార్సీపీ అభిప్రాయపడు తోందన్నారు.

డీఎస్సీ వ్యవహారంతో పాటు ఏపీపీఎస్సీ 2018 గ్రూప్--1 నియామకాలపై చంద్రబాబు, లోకేశ్ గతంలో అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. వాటికి విరుద్ధంగా ఉన్న అంశాలను వైఎస్ జగన్ వీడియోలు, ఇతర ఆధారాలతో ప్రజల ముందుంచారని ఆమె తెలిపారు.

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించి రాజీనామా చేశారనే అంశాన్ని ప్రస్తావించిన రెడ్డి శాంతి.. అదే ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు ప్రభుత్వంలో డీఎస్సీపై ఆరోపణలు వస్తున్నప్పుడు భిన్నమైన ప్రమాణాలు ఎందుకని ప్రశ్నించారు. డీఎస్సీ--2025 వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

అయితే, డీఎస్సీ--2025పై వైఎస్సార్సీపీ చేస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవని టీడీపీ వర్గాలు భావిస్తుండగా, ఆరోపణలపై ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. సీబీఐ విచారణకు సంబంధించి వైఎస్ జగన్ చేసిన సవాల్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ స్పందన కోసం ఇప్పుడు డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని వైఎస్సార్సీపీ పేర్కొంది.




# డంపింగ్ యార్డున్నా..
# రోడ్డు పక్కనే వ్యర్థాల గుట్టలు

- చల్లవానిపేట పంచాయతీలో చెత్త నిర్వహణపై నిర్లక్ష్యం
- జగనన్న కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిసరాల్లో దుర్వాసన
- రహదారిలో ప్రయాణిస్తున్న వాహనదారులకు ఇబ్బందులు

**జలుమూరు, ఆగస్టు 22(వార్త):** చల్లవానిపేట పంచాయతీలో ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వినియోగం లేకుండాపోవడంతో చెత్త, వ్యర్థాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పరిధిలో సేకరించే చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి, వ్యర్థాల నుంచి సంపద సాధించే విధానాన్ని అమలు చేయాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా చర్యలు కనిపించడం లేదని అంటున్నారు. ప్రస్తుతం పలు గ్రామాల నుంచి సేకరిస్తున్న చెత్త, వ్యర్థాలను చల్లవానిపేట పంచాయతీకి ఆనుకుని ఉన్న జగనన్న కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పడవేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని, పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతం మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు దుర్వాసనతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రహదారి పక్కనే వ్యర్థాలను విచ్చలవిడిగా వేయడంతో పరిసరాల పరిశుభ్రత దెబ్బతింటోందని, వర్షం కురిసే సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును సక్రమంగా వినియోగించి పంచాయతీ పరిధిలోని చెత్తను అక్కడికే తరలించాలని ప్రజలు కోరుతున్నారు. వ్యర్థాల నుంచి సంపద సాధించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి, రహదారి పక్కన వ్యర్థాలను వేయకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.



# పలాస రైల్వే స్టేషన్‌లో ఏడీఆర్ఎం ఆకస్మిక తనిఖీ

- మద్యం సేవించి విధులకు హాజరైన సీనియర్ గార్డ్ సస్పెన్షన్

**పలాస, ఆగస్టు 22 (వార్త):** పలాస రైల్వే స్టేషన్‌లో విశాఖపట్నం రైల్వే డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఏడిఆర్ఎం) కుందు రామారావు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న సీనియర్ రైలు మేనేజర్ (సీనియర్ టీఎంఆర్/సీనియర్ గార్డ్) కె. భాస్కరరావు మద్యం సేవించి విధులకు హాజరైనట్లు అధికారులు గుర్తించారు. ప్రయాణికుల భద్రత, రైళ్ల సురక్షిత నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు భాస్కరరావును తక్షణమే సస్పెండ్ చేస్తూ ఏడిఆర్ఎం కుందు రామారావు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఏడిఆర్ఎం మాట్లాడుతూ రైల్వే శాఖలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం, క్రమశిక్షణా రాహిత్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. విధుల్లో అజాగ్రత్తగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో పాల్గొన్న ఇతర రైల్వే అధికారులు, సిబ్బందికి విధి నిర్వహణ, ప్రయాణికుల భద్రత, క్రమశిక్షణకు సంబంధించి పలు సూచనలు, సలహాలు అందజేశారు.

# సోంపేటలో మెగాస్టార్ జన్మదిన వేడుకలు



**సోంపేట, ఆగస్టు 22(వార్త):** సోంపేట పట్టణంలో మెగాస్టార్ చిరంజీవి 71 వ జన్మదిన వేడుకలు శనివారం మెగా యూత్ ఫోర్స్ ఇచ్చాపురం నియోజకవర్గం కన్వీనర్ గంతి మోహన్, కో కన్వీనర్ బీన ప్రదీప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బీసీ గర్ల్స్ హాస్టల్లో బాలికలతో కలిసి జన్మదిన వేడుకలు చేపట్టారు. కేక్ కట్ చేసి సరదాగా గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన వాటర్ ప్యూరిఫైయర్ ను మెగా యూత్ ఫోర్స్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా హాస్టల్ అధికారి మెగా యూత్ ఫోర్స్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బొమ్మిడి తేజ, ఆనంగి గణపతి, సీలం బాలు, దేవాడ రవికుమార్, రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సోంపేటను హడలెత్తిస్తున్న చోరీలు

**సోంపేట, ఆగస్టు 22(వార్త):** సోంపేటలో ఒకే రోజులో జరిగిన పలు చోరీలు స్థానికులను హడలెత్తిస్తున్నాయి. శుక్రవారం రాత్రి పట్టణంలోని సీతారాంపేట వీధికి చెందిన టెంక రాజారావు పల్సర్ బైక్ తోపాటు ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురయ్యాయి. శనివారం మధ్యాహ్నం పట్టపగలు బనిశెట్టి వీధిలో ఒకరికి చెందిన స్కూటీ దొంగతనం జరిగింది. గొంద్యాల పుట్టుగ గ్రామానికి చెందిన ఆణింగి లోకనాథం బనిశెట్టి వీధిలో బంధువుల ఇంటికి వచ్చి ఇంటి లోపలకు వెళ్లి భోజనం చేస్తుండగా ఇటీవలే కొనుగోలు చేసిన, బయట పార్కింగ్ చేసిన కొత్త స్కూటీని దొంగిలించుకుపోయారు. ఈ రెండు సంఘటనల పట్ల బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి ఎస్సై మోహిని ఆధ్వర్యంలో ఉదయం నుంచి దర్యాప్తు చేపట్టాయి. వివిధ కూడళ్ళలో సిసి టీవీ ఫుటేజ్ లను పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగా దొంగలను కనిపెట్టేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రాత్రి జరిగిన పల్సర్ బైక్, బ్యాటరీ చోరీ విషయంలో దొంగలు రాత్రి 11 గంటల దాటిన తర్వాత శ్రీశైన వీధి గుండా బూరగాం రహదారిలో జాతీయ రహదారికి వెళ్లినట్టు తెలుస్తోంది. పూర్తి సమాచారం కోసం పోలీసు వర్గాలు అన్ని కోణాల నుంచి దర్యాప్తును ముమ్మరం చేశాయి.

# ఉపాధ్యాయులకు 'శ్వాసపై ధ్యానం' శిక్షణ

- విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపుపై అవగాహన
- సారవకోట మండల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ
- మార్గదర్శకాలు అందించిన ఎంఈవో వెంకటరమణ

**సారవకోట, ఆగస్టు 22(వార్త):** విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపొందించడంతో పాటు మానసిక ప్రశాంతతకు దోహదపడే విధానాలపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులలో ఏకాగ్రతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు తరగతి గదుల్లో అనుసరించాల్సిన విధానాలపై 'శ్వాసపై ధ్యానం' అంశంతో అవగాహన కల్పించారు. రోజువారీ బోధనలో భాగంగా విద్యార్థులకు శ్వాసపై ధ్యానం వంటి సాధారణ పద్ధతులను పరిచయం చేయడం ద్వారా వారిలో ప్రశాంతత, క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపొందే అవకాశం ఉందని శిక్షణలో వివరించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి వెంకటరమణ హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థుల మానసిక వికాసానికి ప్రాధాన్యం ఇస్తూనే నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తన, అభ్యాస సామర్థ్యాలను గుర్తించి వారికి తగిన మార్గదర్శకత్వం అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శిక్షణలోని పలు అంశాలపై అవగాహన పొందారు. విద్యార్థుల్లో సానుకూల దృక్పథం, ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయుక్తంగా ఉంటాయని పలువురు అభిప్రాయపడ్డారు.



# చల్లవానిపేట-శ్రీముఖలింగం మార్గంలో జంగిల్ క్లియరెన్స్

- నాయుడుగారి రాజశేఖర్ వినతిపత్రంతో కదిలిన అధికారులు
- కలెక్టర్ ఆదేశాలతో అచ్చుతాపురం వరకు రెండు రోజులుగా పనులు
- శ్రీముఖలింగం--కరకవలస--కిట్టలపాడు వరకు చర్యలు




**జలుమూరు, ఆగస్టు 22(వార్త):** చల్లవానిపేట నుంచి శ్రీముఖలింగం మీదుగా కరకవలస, కిట్టలపాడు వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా విస్తరించిన జంగిల్, ముళ్లపొదలు, తుప్పలను తొలగించేందుకు జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమై కొనసాగుతున్నాయి. శ్రీముఖలింగేశ్వర దేవస్థానం అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, 2024లో శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన నాయుడుగారి రాజశేఖర్ మరియు జలుమూరు మండలం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఠ శ్రీముఖలింగం మాజీ సర్పంచ్ గుంట కర్ణవీరుడు అధికారులకు వినతిపత్రం అందజేయడంతో ఈ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. గత కొద్ది నెలలుగా చల్లవానిపేట నుంచి శ్రీముఖలింగం మీదుగా కరకవలస, కిట్టలపాడు వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు, జంగిల్, తుప్పలు విపరీతంగా పెరగడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోల్లో ప్రయాణించే వారు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రహదారి పక్కన ముళ్లపొదలు విస్తరించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ఈ విషయమై నాయుడుగారి రాజశేఖర్ మరియు గుంట కర్ణవీరుడు సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేసి, రహదారికి ఇరువైపులా పెరిగిన జంగిల్, ముళ్లపొదలను తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. రహదారిపై ఏర్పడుతున్న ప్రమాదకర పరిస్థితిని, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ పీజీఆర్ఎస్‌లో కూడా వినతిపత్రం సమర్పించడంతో అధికారులు స్పందించినట్లు తెలిసింది. వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ రోడ్లు, భవనాల శాఖ అధికారులకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో స్థానిక ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టి ప్రస్తుతం చల్లవానిపేట నుంచి అచ్చుతాపురం వరకు రెండు రోజులుగా జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహిస్తున్నారు. రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు, తుప్పలు, జంగిల్‌ను తొలగిస్తున్నారు. అచ్చుతాపురం నుంచి శ్రీముఖలింగం, అక్కడి నుంచి కరకవలస, కిట్టలపాడు వరకు ఉన్న రహదారి పరిధిలో కూడా మరో మూడు రోజుల పాటు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. పనులు పూర్తయితే రహదారిపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తగ్గడంతో పాటు ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ముఖ్యంగా శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులు ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో ఇప్పటివరకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పక్కన విస్తరించిన ముళ్లపొదల కారణంగా వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతుండడంతో భక్తులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాయుడుగారి రాజశేఖర్ చేసిన ఫిర్యాదు, వినతిపత్రంపై అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్ల కుల ధ్రువీకరణపై ప్రత్యేక పరిశీలన

**నరసన్నపేట, ఆగస్టు 22(వార్త):** నరసన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్ల ఇంటింటి సర్వే, కుల ధ్రువీకరణ ప్రక్రియను డీఎల్పీవో ఆర్. గోపీబాల శనివారం పరిశీలించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న డోర్ టు డోర్ వెరిఫికేషన్ ప్రక్రియపై వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి తమ పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్ల ఇళ్లకు నేరుగా వెళ్లి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఓటర్లకు సంబంధించిన కుల వివరాల ధ్రువీకరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం మాత్రమే సర్వే సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. సేకరించిన వివరాలను సంబంధిత డిప్యూటీ ఎంపీడీవో లాగిన్‌లో ఎప్పటికప్పుడు నవీకరించాలని గోపీబాల సూచించారు. డేటా నమోదు సమయంలో వివరాలన్నీ సరైనవిగా ఉన్నాయో లేదో మరోసారి పరిశీలించాలని పేర్కొన్నారు. తప్పులు లేదా అసంపూర్ణ సమాచారం నమోదైతే తదుపరి ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. మండలంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్లకు సంబంధించి నిర్వహిస్తున్న సర్వేను నిర్ణీత సమయంలో, పక్కాగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాల మధ్య వ్యత్యాసాలు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




# పలాసలో ఘనంగా
# మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు..
నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



**పలాస, ఆగస్టు 22 (వార్త):** మెగాస్టార్, పద్మవిభూషణ్ డాక్టర్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పలాస నియోజకవర్గంలో అభిమానులు శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో ప్రారంభించిన అభిమానులు.. పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ చిరంజీవి అభిమాని నందిగాం ధర్మారావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు చిరంజీవి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. ఆయన చూపిన సేవా మార్గంలోనే అభిమానులు ముందుకు సాగుతున్నారని తెలిపారు. నిజమైన అభిమానానికి సేవే ప్రాతిపదిక అని పేర్కొన్నారు. అనంతరం పలువురు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రాత్రి అభిమానుల సమక్షంలో భారీ కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ధర్మారావు తెలిపారు. కార్యక్రమంలో అభిమానులు శంకు శ్రీకాంత్, సర్వావరపు ప్రదీప్, ఉదయ్, సాయి, దీన పాత్రో, శ్రీను, కిషోర్, రాజ్యలక్ష్మి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో మెగా అభిమానులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో చికిత్స పొందుతున్న
# బద్రి మల్లేసుకు లొడగల పరామర్శ



**పలాస, ఆగస్టు 22 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లభద్ర గ్రామానికి చెందిన ఆత్మీయుడు బద్రి మల్లేసు అనారోగ్యంతో లాస్యప్రియ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వెంటనే టీడీపీ నాయకుడు లొడగల.. ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. దైవానుగ్రహంతో బద్రి మల్లేసు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మునుపటిలా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పాఠ్యాంశాలపై పూర్తి అవగాహనతో బోధన

- బోధించే అంశంపై ఉపాధ్యాయులుద పూర్తి పట్టు సాధించాలి
- మడపాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ కాంప్లెక్స్
- సులభతర బోధనతో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం పెంపునకు సూచన



**నరసన్నపేట, ఆగస్టు 22(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులు తాము బోధించే పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన, పట్టు కలిగి ఉండాలని నరసన్నపేట ఎంఈవో పేడాడ దాలినాయుడు సూచించారు. ఉపాధ్యాయులు బోధనా అంశాలను ముందుగానే సమగ్రంగా అధ్యయనం చేసి తరగతి గదిలో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా వివరించాలని అన్నారు. నరసన్నపేట మండలం మడపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. బోధించే అంశంపై ఉపాధ్యాయులకు పూర్తి పట్టు ఉంటే క్లిష్టమైన అంశాలను సైతం విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంలోనూ, వారి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించడంలోనూ ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తక జ్ఞానానికి పరిమితం చేయకుండా ఉదాహరణలు, చర్చల ద్వారా ఆసక్తికరంగా బోధించాలని సూచించారు. క్లస్టర్ కాంప్లెక్స్‌లో పాఠ్యాంశాల బోధన, విద్యార్థుల అభ్యసన స్థాయి, తరగతి గది నిర్వహణ తదితర అంశాలపై ఉపాధ్యాయులు చర్చించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

*** అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు * ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న ఎరువుల స్టాక్‌ను పరిశీలించండి * అధిక ధరలకు యూరియా, డీఏపీ విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు * షట్టర్ల మరమ్మతుల్లో నిర్లక్ష్యంపై మంత్రి ఆగ్రహం * రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం * నీటి ప్రవాహానికి అడ్డంకులు సృష్టిస్తే కేసులు పెట్టండి * వ్యవసాయాధికారులు కార్యాలయాలకే పరిమితం కాకూడదు * గ్రామాల్లో పర్యటించి రైతులకు న్యాయం చేయండి * అర్హులైన రైతులందరికీ వంద శాతం పంటల బీమా చెల్లింపులు జరగాలి * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, ఆగస్టు 22(వార్త):** జిల్లాలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 4,08,995 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణానికి గాను ఇప్పటివరకు 3,65,604 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సాగు విస్తీర్ణానికి రెండో దశ వరకు 26,440 టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 25,860 టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు తెలిపారు. ఇందులో సుమారు 12,000 టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రాలు, సహకార సొసైటీల ద్వారా రైతులకు అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో మరో 11,659 టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులకు ఎలాంటి కొరత లేదని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా 3,707 టన్నుల డీఏపీ నిల్వలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరానికి అనుగుణంగా ఎరువుల సరఫరాను కొనసాగించాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రైవేటు ఎరువుల డీలర్లు యూరియా, డీఏపీని ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠినంగా వ్యవహరించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. రైతులకు అవసరం లేని ఇతర ఎరువులను బలవంతంగా అంటగట్టే ప్రయత్నం చేసినా ఉపేక్షించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై తక్షణమే చర్యలు తీసుకుని, అవసరమైతే వారి లైసెన్సులు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎరువుల విషయంలో రైతులు ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను కూడా గుర్తించి, ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. డీలర్ల వద్ద ఉన్న స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఎరువులను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## వంద శాతం పంటల బీమా చెల్లింపులు జరగాలి..

జిల్లాలో అర్హులైన రైతులందరికీ నూటికి నూరు శాతం పంటల బీమా అందేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి ఆదేశించారు. ఒక్క అర్హత కలిగిన రైతు కూడా బీమా ప్రయోజనం కోల్పోకుండా గ్రామస్థాయిలో వివరాలను పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పంటల బీమా, ఎరువుల సరఫరా, సాగు విధానాలు, రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపై ఉందన్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రతి గ్రామానికి వెళ్లి రైతులతో నేరుగా మాట్లాడాలని, వారి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి

కాలువల చివరి ప్రాంతాల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతులకు అధిక ప్రయోజనం కలిగే పంటల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో రైతులకు పంటల ఎంపిక, సాగు పద్ధతులు, ఎరువుల వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు ఇవ్వాలని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు, నకిలీ విత్తనాలు, అధిక ధరలకు ఎరువుల విక్రయాలు, అక్రమ నిల్వలు వంటి వాటిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామాన్ని వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించి రైతులకు ప్రభుత్వ పథకాలు, పంటల బీమా, ఎరువుల లభ్యత, ఆరుతడి పంటల సాగు తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, సమస్యలు ఉత్పన్నమైన తరువాత స్పందించడం కాకుండా ముందుగానే వాటిని గుర్తించి పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో రైతు సంక్షేమానికి సంబంధించి ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు అందాల్సిన ప్రతి ప్రభుత్వ ప్రయోజనం సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు కృష్ణారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.






## పెట్టుబడిదారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత బలోపేతం చేసి, స్థానికంగా ఉపాధి, ఆర్థిక అవకాశాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయి. మూలపేట ప్రాంతంలో ఇప్పటికే కోరమాండల్ సంస్థ పరిశ్రమ స్థాపనకు ముందుకు రాగా, తాజాగా ప్రముఖ ఔషధ తయారీ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ కూడా అదే ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపడం జిల్లాకు శుభపరిణామమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నిమ్మాడలోని మంత్రి కార్యాలయంలో గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. మూలపేట ప్రాంతంలో తమ సంస్థను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్నట్లు మంత్రికి వివరించారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూ కేటాయింపులు, విద్యుత్, నీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని సంస్థ ప్రతినిధులు మంత్రిని కోరారు. పరిశ్రమ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. భూ కేటాయింపులతో పాటు అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఇతర ప్రభుత్వ అనుమతుల విషయంలో కూడా నిబంధనల మేరకు వేగంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో పారిశ్రామికవేత్తలకు అవసరమైన అనుమతులు, సదుపాయాలను వేగంగా అందిస్తూ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో రాష్ట్రంపై పారిశ్రామికవేత్తల్లో ఏర్పడిన అనిశ్చితిని తొలగించి, దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని మంత్రి తెలిపారు. నూతన పారిశ్రామిక విధానాలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. మూలపేట ప్రాంతంలో కోరమాండల్‌తో పాటు గ్రాన్యూల్స్ ఇండియా వంటి సంస్థలు పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు జిల్లా సమగ్రాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరగడం, స్థానిక వ్యాపారాలు అభివృద్ధి చెందడం, మౌలిక వసతులు మెరుగుపడటం ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. మూలపేట ప్రాంతాన్ని భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చెందిన పారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని మంత్రి స్పష్టం చేశారు. పెట్టుబడులు-పరిశ్రమలు-ఉపాధి-అభివృద్ధి అనే లక్ష్యంతో ముందుకు సాగుతూ జిల్లా ప్రజలకు మెరుగైన ఆర్థిక, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. మూలపేటలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యేలా పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం అందిస్తూ, జిల్లా సమగ్రాభివృద్ధిని వేగవంతం చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ భారతీయ ఔషధ సంస్థ. యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్స్, ఇంటర్మీడియేట్స్, ఫినిష్డ్ డోసేజ్ ఉత్పత్తులను తయారు చేస్తూ దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లకు కూడా ఔషధాలను ఎగుమతి చేస్తోంది. ఇటువంటి ప్రతిష్టాత్మక సంస్థ జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం పారిశ్రామిక రంగానికి మరింత విశ్వాసాన్ని కల్పిస్తుందని మంత్రి అన్నారు.

## గ్రామాల ప్రతిష్ట పెంచేలా అభివృద్ధి

గ్రామాల ప్రతిష్ట పెరిగేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని భగవాన్ పురం, చింతల గార గ్రామాల్లో శనివారం మంత్రి పర్యటించారు. చింతల గారా గ్రామంలో రూ. 17.60 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో రక్షితమైంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. భగవాన్‌పురం, చింతల గారా గ్రామాల్లో రూ .268 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్దే జిల్లా సమగ్ర ప్రగతికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. వర్షపాతం లోటు ఉన్నప్పటికీ వంశధార నీటిని కాలువల ద్వారా రైతాంగానికి సాగునీరు అందించి, రైతులకు అండగా నిలిచామని తెలిపారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేల చొప్పున అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ పనులకు అవసరమైన ఆధునిక పనిముట్లను రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులను పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక లోటు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ సమస్యలను పరిష్కరించి రైతులకు శాశ్వత భూహక్కు పట్టాదారు పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

## బేబీ ఫీడింగ్ రూమ్, సులభ్ కాంప్లెక్స్‌లు ప్రారంభం

టెక్కలి ఇందిరాగాంధీ కూడలి వద్ద అధునాతన హంగులతో నిర్మించిన బేబీ ఫీడింగ్ రూమ్, సులభ కాంప్లెక్స్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ప్రారంభించారు. అంచనా వ్యయం రూ.37 లక్షల వ్యయంతో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఈ సదుపాయాలను మంత్రి ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. బేబీ ఫీడింగ్ రూమ్ ద్వారా తల్లులు తమ శిశువులకు ప్రశాంతమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో పాలిచ్చే అవకాశం కల్పించారు. సులభ కాంప్లెక్స్‌తో ప్రయాణికులు, ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు మహిళలు, శిశువుల సౌకర్యానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

## ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

అంతకుముందు పట్టణంలోని సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న పట్టు మహాదేవా కోనేరులో ఏర్పాటు చేయనున్న స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా ఆసుపత్రి ఆవరణలో రూ.55లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మార్చురీ గదిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీఅధ్యక్షులు బగాది శేషగిరిరావు, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, మండల అభివృద్ధి అధికారి అలివేలు మంగ, తహశీల్దార్ రాంబాబు, ఎంపీడీవో రేణుక, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఎస్.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# గెలుపు ఒక్క రోజులో దక్కదు

*** విద్యార్థులు కలలను.. లక్ష్యాలుగా మలచుకోవాలి**
*** విజయానికి ఆత్మవిశ్వాసమే ఆయుధం**
*** సినీ నటుడు ప్రదీప్ కొండిపర్తి**
*** ఐతంలో ఘనంగా సిల్వర్ జూబ్లీ అలుమ్ని వేడుకలు**
*** 2005 నుంచి 2020 వరకు వివిధ బ్యాచ్‌లకు చెందిన 350 మంది పూర్వవిద్యార్థుల హాజరు**







**టెక్కలి/సంతబొమ్మాళి, ఆగస్టు 22 (వార్త):** విద్యార్థులు కలలను లక్ష్యాలుగా మలచుకుని, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నిరంతర కృషితో విజయ శిఖరాలను అధిరోహించాలని చిత్రపరిశ్రమకు చెందిన ప్రదీప్ కొండిపర్తి అన్నారు. టెక్కలి సమీపంలోని ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ డా. కె. సోమేశ్వరరావు అధ్యక్షతన సిల్వర్ జూబ్లీ అలుమ్ని వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2005 నుంచి 2020 వరకు వివిధ బ్యాచ్‌లకు చెందిన సుమారు 350 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రదీప్ కొండిపర్తి విద్యార్థులతో మమేకమై పలు కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని వారిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయం ఒక్కరోజులో దక్కేది కాదని, నిరంతరం నేర్చుకోవడం, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవడం, లక్ష్య సాధనకు పట్టుదలతో ముందుకు సాగడం విజయానికి బాటలు వేస్తాయని అన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సృజనాత్మకత, నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆయన కళాశాల ప్రాంగణాన్ని సందర్శించి విద్యా భవనాలు, ప్రయోగశాలలు, ఉద్యానవనం, క్రీడా మైదానాలు తదితర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను, కళాశాలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అభినందించారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఐతం కళాశాల అభివృద్ధి ప్రస్థానాన్ని వివరించారు. "విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నూతన భవనాలు, ఆధునిక ప్రయోగశాలలు, మెరుగైన మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నాం. విద్యార్థుల్లో సృజనాత్మకత, పారిశ్రామిక ఆలోచనలను పెంపొందించేందుకు స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాం అని తెలిపారు. వివిధ రంగాల్లో స్థిరపడిన అలుమ్ని విద్యార్థులు ఐతం కళాశాలకు గర్వకారణం.. అలుమ్ని క్యాంపస్‌కు చిరస్మరణీయ జ్ఞాపకం.. కళాశాల అభివృద్ధికి బలమైన వెన్నెముక అని స్పష్టం చేశారు. పూర్వ విద్యార్థుల అనుభవాలు, సూచనలు, సహకారం కళాశాల భవిష్యత్ ప్రగతికి ఎంతో విలువైనవన్నారు. ఐతం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ జాతీయ స్థాయిలో గుర్తింపు సాధిస్తోందని, ఇప్పటికే ఎన్ఐఆర్ఎఫ్ గుర్తింపు పొందడం కళాశాల ప్రస్థానంలో కీలక మైలురాయిగా నిలిచిందని తెలిపారు. అలుమ్ని కోఆర్డినేటర్ డా.డి.యుగంధర్ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలవాలని కోరారు. ముఖ్యంగా స్టార్టప్ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమల్లో శిక్షణ, ఉద్యోగావకాశాల కల్పనలో తమ అనుభవం, పరిచయాలను ఉపయోగించి విద్యార్థులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కళాశాలలో నిర్మించనున్న అలుమ్ని బ్లాక్‌కు తమ వంతు సహకారం అందించాలని కోరగా, పూర్వ విద్యార్థులు సానుకూలంగా స్పందించి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. చైర్మన్ డా.కె.సోమేశ్వరరావు మాట్లాడుతూ.. సిల్వర్ జూబ్లీ వేడుకలు ఐతం ప్రస్థానంలో చిరస్మరణీయ ఘట్టమన్నారు. 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీని చేసుకుంటున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో గోల్డెన్ జూబ్లీ, డైమండ్ జూబ్లీ వంటి మైలురాళ్లను దాటుకుంటూ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించే స్థాయికి ఐతం ఎదగాలని కోరారు. ఈ ప్రస్థానంలో అలుమ్ని విద్యార్థుల సహకారం, భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ కళాశాల జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ప్రస్తుత విద్యార్థులతో అనుభవాలను పంచుకున్నారు. పూర్వ, ప్రస్తుత విద్యార్థుల ఆత్మీయ కలయికతో కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొంది.కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎల్.ఎల్. నాయుడు, కోశాధికారి టి. నాగరాజు, డైరెక్టర్లు కె. మధుకుమార్, నాగశేషు, ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, అలుమ్ని కోఆర్డినేటర్ డా. డి. యుగంధర్, డీన్లు, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546